ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

విశాలాంధ్ర - కొమరాడ: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల విభజన నేపథ్యంలో పార్వతి పురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత వ్యాపారస్తులు భూములు అధిక ధరలకు కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రోడ్డు పక్కన ఉన్న భూములతో పాటు ప్రభుత్వ బంజరు భూములపై కూడా అక్రమార్కులు దృష్టి పెట్టడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూములను ప్రభుత్వం భూములుగా చూపించి అమ్మకాలు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొనుగోలు చేసిన భూములతో పాటు ప్రభుత్వ భూములను కూడా చదును చేసి అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. వేలాది విలువైన ప్రభుత్వ భూములతో పాటు జిరాయితి భూముల్లో కూడా ల్యాండ్ కన్వర్షన్ చేపట్టిన తర్వాత మట్టి తవ్వకాలు చేపట్టాలని ఉన్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు మండలంలో జోరందుకున్నాయి. కొమరాడ మండలంలోని గుమడ గ్రామ సమీపంలో పెట్రోల్ బంకు నిమిత్తం పొలంలో మట్టిని తవ్వి ట్రాక్టర్ సహాయంతో ఆ మట్టిని స్థలంలో డంపింగ్ చేస్తున్నారు. మైనింగ్ అధికారులు, తహశీల్దార్ అనుమతి తీసుకుని మట్టి తవ్వకాలు జరపాలి. కానీ దానికి విరుద్ధంగా ఎటువంటి పర్మిషన్ లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం వలన ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి పడుతుంది. రోడ్డు పక్క నుంచి నిత్యం తిరుగుతున్న అధికారులకు ఈ తవ్వకాలు కనిపించవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిరాయితి భూముల్లో కూడా తవ్వకాలు జరపడం రెవెన్యూ అనుమతులు తప్పనిసరి అని పలువురు అంటున్నారు. ఏదిఏమైనా పంట సాగు చేస్తున్న భూములు స్వాధీనం చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చేస్తే ల్యాండ్ కన్వర్షన్ చేసి ప్రభుత్వ వాటా చెల్లించిన తర్వాత చేపట్టాలని ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా కొంతమంది ఇష్టానుసారంగా అధికారులతో కుమ్మక్కై ముడుపులు చెల్లించి పనులు సాఫీగా చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కొమరాడ ఇన్‌చార్జ్ తహశీల్దార్ శివయ్యను వివరణ కోరగా మట్టి తవ్వకాలకు తప్పనిసరిగా అనుమతులు కావాలని పరిశీలన చేసి చర్యలు చేపడతామన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - కొమరాడ: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రధానాచార్యులు డి.లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు గడువు ముగుస్తుందని, ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి అర్హులు అన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఆదివారం నిర్వహించబడుతుందన్నారు.

ఘనజీవామృతం తయారీపై అవగాహన

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ, జమ్ము పంచాయతీ పరిధిలో పెంగవ గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం, జీవ ప్రాజెక్టు సంయుక్తంగా జట్టు సంస్థ పర్యవేక్షణలో ఘనజీవామృతం తయారు చేశారు.

భూమిని సారవంతం చేసుకోవడానికి ఘనజీవామృతం ఉపయోగ పడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వేసవి కాలంలో తయారు చేసుకుని నిల్వ ఉంచుకుని ఖరీఫ్ కాలంలో తొలకరి జల్లులకు ముందు ప్రారంభ దశలో అవసరమైన అన్ని రకాల పంటలకు వేసుకోవడానికి సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జి.మురళీమోహన్, మోడల్ మేకర్ ఆర్. రామారావు, ఎల్ వన్ పి.జగదీష్, ఎల్ టు టి.మన్మధరావు, కే.చిరంజీవి, ఎల్3 పి.దివాకర్, ఎం.సురేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - వీరఘట్టం: ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా వీరఘట్టంలోని ఫారంపాండుకు టిడిపి అగ్ర నాయకులు నిమ్మక పాండురంగ శంకుస్థాపన చేశారు. మండల పరిధిలో ఉన్న గ్రామాల్లో టిడిపి నాయకుడు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు శంకుస్థాపనలు నిర్వహించారు. వీరితోపాటు ఏపీవో సత్యం నాయుడు, కోపరేటివ్ మాజీ ప్రెసిడెంట్ గొర్లె గౌర్నాయుడు, రమేష్, గ్రామ ప్రజలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గిరిజనుడు మృతి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని అలమండ పంచాయతీ రావాడ రామభద్రపురంలో పాము కాటుతో బిడ్డిక వెంకటి (52) అనే గిరిజనుడు శుక్రవారం మృతి చెందారు. పనికి వెళ్లి ఇంటికి చేరుకొని విశ్రాంతి తీసుకుంటుండగా అతనిని నాగుపాము కాటు వేసింది. దీంతో పాము కాటు వేసిందని ఆందోళన చెందుతుండగా కాటు వేసిన పాము ఇంట్లోకి ప్రవేశించి సామాన్లలో దూరడంతో దానిని చంపి స్పృహ కోల్పోయి పడిపోయాడు. దీనిని గమనించిన చుట్టుపక్కల వాళ్ళు అతనిని దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఆయనను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇంతలో 108లో తీసుకు వెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈయనకు ఒక కుమార్తె (11) ఉంది.

నేడు రెల్లి సామాజిక వర్గ సమావేశం

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ పట్టణంలో రెల్లి కుల సామాజిక వర్గ సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక రెల్లి వీధిలో నిర్వహిస్తున్నట్లు ఆ సామాజిక వర్గ నాయకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెల్లి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోటన్న రవి కుమార్ హాజరు అవుతున్నారని డివిజన్ అధ్యక్షుడు మజ్జి బాబ్జి, కార్యదర్శి బెవర శివప్రసాద్, కోశాధికారి పీస్నింటి అప్పన్న తెలిపారు. ఈ సమావేశానికి రెల్లి కులస్తుల అందరూ హాజరవ్వాలని వారు కోరారు.

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి
అధికారికంగా నిర్వహించాలి: సీపీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: దేశ స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం అమరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ పార్వతీపురం మన్యం జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన డిమాండ్ చేశారు. వర్ధంతిని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన బాధ్యత పాలకులదేనని ఉద్ఘాటించారు. భగత్ సింగ్ జాతీయ ఉద్యోగ, ఉపాధి గ్యారెంటీ చట్టాన్ని రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్య అనంతరం కుల, మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమ సమాజ స్థాపన కలలు కన్నారన్నారు. మతోన్మాద ముక్త భారతం సాధించడానికి భగత్ సింగ్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. సామాజిక, న్యాయం, లౌకిక వాద పరిరక్షణ, శాస్త్రీయ సోష లిజం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా శాంతి స్థాపన కోసం, అశ్లీల సాహిత్యం, అశ్లీల సినిమాల నిషేధం కోసం, దేశాన్ని చీల్చ డానికి కుట్రలు చేసే విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా, దేశ ఐక్యత, సమైక్యత కోసం సీపీఐ కృషి చేస్తుందన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు రైతులు కృషి చేయాలి

విశాలాంధ్ర - గరుగుబిల్లి: జిల్లాలో ఆయిల్ పామ్ (పామాయిల్ పంట) సాగుకు రైతులు కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. గరుగుబిల్లి మండలం కొంకడి వరం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో భాగంగా ఆయిల్ ఫామ్స్, మినీ గోకులాలను జిల్లా కలెక్టర్ శనివారం పరిశీంచారు. ఈ సందర్భంగా కొంకడివరం గ్రామ సర్పంచ్ తనకున్న ఐదు ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడంపై కలెక్టర్ ఆయనను అభినందించారు. గ్రామ సర్పంచ్‌ని ఆదర్శంగా తీసుకొని మిగిలిన రైతులు కూడా ఆయిల్ పామ్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కేవలం వరి పంట మాత్రమే కాకుండా అధిక లాభాలు, దిగుబడి తెచ్చే లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్ర రావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గరుగుబిల్లి మండల తహశీల్దార్ పి.బాల, యంపిడిఓ జి.పైడితల్లి, సర్పంచ్ అల్లు అప్పల నాయుడు, రైతులు, తదితరులు పాల్గొన్నారు..

24న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

విశాలాంధ్ర - బెలగాం: క్షయ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ (టిబి) నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో శనివారం గోడపత్రికలను విడుదల చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కఫం పరీక్షలు చేయడం జరుగుతుందని, ఎక్స్ రే యంత్రాలు, ఆధునికమైన సిబినాట్, 19 ఆర్ టీపిసిఆర్ టిబి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడా మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ప్రతీ నెలా వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. మందులు క్రమం తప్పకుండా వేసుకునేలా సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన రావు, జిల్లా క్షయ నియత్రణ అధికారి డాక్టర్ ఎం. వినోద్ కుమార్, టిబి ల్యాబ్ సూపర్వైజర్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

నాటుసారా నియంత్రణే లక్ష్యం

విశాలాంధ్ర - సీతంపేట: మండలం కుసిమి గూడ గ్రామంలో రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సూపరింటెండెంట్ మధు బాబు అధ్వర్యంలో రాజాం ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ప్రత్యేక అధికారి ఆర్.జైభీమ్ నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటుసారా తాగటం వలన ఏర్పడే కష్ట నష్టాలను, నాటుసారా వలన కలుగు అనారోగ్యాల గురించి వివరించారు. నాటుసారా అమ్మకాలను నిర్వహిస్తూ పట్టుబడిన వారికి చట్ట ప్రకారం ఉన్న శిక్షలు గురించి వివరించారు. నాటుసారా తయారు చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14405 నకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కుసిమి గూడ సర్పంచ్ ఎస్. కూర్మారావు, సచివాలయం సెక్రటరీ రాజారావు, వి.ఆర్.ఓ., మహిళా పోలీస్, ఇతర అధికారులు, పిసా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీ

విశాలాంధ్ర - పాచిపెంట: మండల కేంద్రమైన పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం మన్యం జిల్లా పార్వతీపురం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ వై.పద్మజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రవిచంద్రతో పాటు వైద్య సిబ్బందితో కొద్దిసేపు మాట్లాడారు. అలాగే లేబరేటరీని పరిశీలించారు. ఓపి రికార్డులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పది పరీక్షల్లో అవకతవకలు..!

- అరకు పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్
- సీసీ కెమెరాల పనితీరు నామమాత్రం

విశాలాంధ్ర - అరకులోయ: అరకులోయలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపియింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో అరకులోయ, డుంబ్రిగుడ మండలానికి సంబంధించి అనేక ఆశ్రమ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం దారుణంగా పడిపోవడంతో పాఠశాలల నిర్వాహకులు ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురయ్యారు. దీంతో ఈ ఏడాది జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో ఏ విధంగానైనా గణనీయమైన ఉత్తీర్ణత సాధించి అధికారుల ప్రశంసలు పొందాలన్న సంకల్పంతో పాఠశాలల నిర్వాహకులు మాస్ కాపీయింగ్‌కు తెర తీసినట్లు తెలిసింది. అరకులోయ కొత్త భల్లుగుడ, డుంబ్రిగూడ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి నామమాత్రంగానే మిగిలాయని విమర్శలు వినిపిస్తున్నాయి. పరీక్ష ప్రారంభం వరకు పనిచేసే సీసీ కెమెరాలు పరీక్ష ప్రారంభమైన అర్ధగంట తర్వాత పరీక్ష ముగిసేంతవరకు పనిచేయటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పాఠశాలల నిర్వాహకులంతా ఏదో రకంగా మాయ చేసి అధికారులకు దొరకకుండా స్థానిక పాత్రికేయులకు మీడియాకు చిక్కకుండా అనేక విశ్వప్రయత్నాలు చేసి మాస్ కాపీయింగ్‌కు తమ వంతు సహకారం అందిస్తున్నట్టు సమాచారం. దీంతో రాత్రి పగలు కష్టపడి మంచి విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు దిగాలు చెందుతున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తే బాగా కష్టపడి చదివిన విద్యార్థులు ఫస్ట్ ర్యాంకు పొంది ఉన్నత కళాశాలలో ఉచిత సీట్లు పొందుతారని తల్లిదండ్రులు అంటున్నారు. అయితే మాస్ కాపీయింగ్ జోరుగా జరగడం వలన అసలు ఎప్పుడూ కూడా పాఠశాలలకు రాని, పుస్తకాలు ముట్టని ఏనాడు చదవని విద్యార్థులు ఉత్తీర్ణులై ర్యాంకులు సాధించే అవకాశం ఉందని దీని వలన బాగా చదివిన విద్యార్థులు మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం కూడా లేకపోలేదని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇక సోమవారం ప్రారంభమైన మొదటి పరీక్ష రోజే నిర్వాహకులు మాస్ కాపీయింగ్‌కు తెరతీసి పరీక్షలు రాయించినట్లు ఈ ప్రాంతంలో పలువురు చర్చించుకుంటున్నారు. ఇక ముందు ముందు జరిగే పరీక్షలలో కూడా జోరుగా మాస్ కాపియింగ్ నిర్వహించి విద్యార్థులను భారీ మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా శనివారం రాత్రి ఉపాధ్యాయులు అంతా సమావేశమై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఇన్విజిలేటర్లకు ప్రత్యేక స్క్వాడ్‌లకు, సిట్టింగ్ స్క్వాడ్‌లకు ఇతర అధికారులకు డబ్బులు ఇవ్వాలని విద్యార్థులకు చెప్పి ఒక్కో విద్యార్థి నుండి రూ.2000 రూపాయలు వసూలు చేసినట్లు కూడా తెలుస్తోంది. అధికారుల మెప్పు కోసం తమ స్వార్థ స్వలాభం కోసం తమ ప్రమోషన్ల కోసం పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు తెరతీసి మెరిట్ విద్యార్థులను బలి చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు కూడా పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదని ప్రత్యేక సిట్టింగ్ స్క్వాడ్‌లు ఉన్నాయని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని అంటున్నారు. ఇక పరీక్ష కేంద్రంలోకి మీడియాకు అనుమతి ఇవ్వకపోవడంతో ఎటువంటి పర్యవేక్షణకు నోచుకోకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారే ప్రశ్నలకు సమాధాన పత్రాలు రూపొందించి జిరాక్స్‌లు తీసి ప్రతి విద్యార్థికి కూడా ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అరకులోయ, కొత్తబల్లుగుడ, డుంబ్రిగుడ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరుపై కూడా నిఘా పెట్టి సమగ్ర విచారణ జరిపితే అనేక వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కథనాలపై అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీని వివరణ కోరగా పది పరీక్షాలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా సిట్టింగ్ స్క్వాడ్‌ను కూడా నియమించామని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఆకస్మికంగా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారని ఆయన తెలియజేశారు. మాస్ కాపీయింగ్ జరిగినట్లు తమ దృష్టికి వస్తే ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

ఎంపీపీ ఎన్నికలపై టీడీపీ నేతల సమీక్ష

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో ఏపీ టీడీసీ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు, మాజీ మంత్రి మత్స్యరాస మణి కుమారి టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. టీడీపీ ఎంపీటీసీల సంఖ్యను అలాగే ఇతర పార్టీల ఎంపీటీసీల వివరాలను తెలుసుకున్నారు. ఎంపీపీ ఎలక్షన్‌కు సంబంధించి ముఖ్యమైన విషయాలను సీనియర్ నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమల చిట్టిబాబు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్, ఎంపీటీసీలు, ఎంపీపీ కళ్యాణి, సర్పంచులు, జనసేన భీమన్న, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

825 ఫారం పాండ్‌లు మంజూరు

విశాలాంధ్ర - కొయ్యూరు: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పథకం ద్వారా రైతులకు ఫారం పాండ్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా ఉన్న 33 పంచాయతీలో ఫారం పాండ్స్ పనులను ప్రారంభించారు. అనంతరం ఏపీవో అప్పలరాజు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 825 ఫారం పాండ్స్ మంజూరు కాగా 231 పూర్తి చేయడం జరిగిందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం అప్పలరాజు అన్నారు. ఈ కార్యక్రమంలోం రాజేంద్రపాలెం సర్పంచ్ పేట సింహాసనం, మండల వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గూడెం లక్ష్మణ్, రాజేంద్రపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బల్ల ప్రసాదు, మాజీ పీసా కార్యదర్శి స్వామి నాయుడు పాల్గొన్నారు.

వేంగడ పంచాయతీలో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని వేంగడ పంచాయతీ పరిధి బందవలస, మంద్రువలస, గోమంగిపాడు గ్రామంలో నెలకొన్న మౌలిక వసతి సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని వెంగాడ పంచాయతీ సిపిఎం మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం పార్టీ కార్యకర్తలతో గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, హౌసింగ్ సమస్యలు ఉన్నాయని ఆయన తెలిపారు. వేంగడ మెయిన్ రోడ్డు నుండి గోమ్మగింపాడు, మంద్రువలస రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బందవలస గ్రామం మార్గమధ్యలో కల్వర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఎం.రామన్న, సప్పి అప్పన్న, వార్డు మెంబర్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం కోసం ఎంపీటీసీల ఎదురు చూపులు

విశాలాంధ్ర - జీకే వీధి: జీకే వీధి మండలం ఎంపిటిసిలకు ప్రభుత్వం కేటాయించిన గౌరవ వేతనం నేటికీ 27నెలలు గడుస్తున్నప్పటికీ చెల్లించలేదని సిపిఎం ఎంపీటీసీ అంపురంగి బుజ్జి బాబు, వైస్ ఎంపీపీ సప్పగిడ్డ ఆనందరావు అన్నారు. అధికారులు నిర్లక్ష్యమా లేక ప్రభుత్వ లోపమో తెలియక సతమతమవుతున్నారని అన్నారు. గౌరవ వేతనం లేక అయోమయ స్థితిలో ఉన్నారన్నారు. ప్రజాసమస్యలు తెలుసుకొని అధికారులు దృష్టికి తీసుకొని వెళ్ళాడానికి కూడ అవకాశం లేదని వాపోయారు. ఎంపిటిసిలకు నిధులు కేటాయించి, వర్క్ ఆర్డర్‌లు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎంపిటిసిలకు రావలసిన గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్ ఎం పిపి,చప్పగడ్డ, ఆనందరావు, గాలి కొండ ఎంపిటిసి బుజ్జి బాబు పాల్గొన్నారు.

తూర్పు ఏజెన్సీలో 3 వేల ఫారం పాండ్స్ మంజూరు

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలోని ఏడు మండలాల్లో సుమారు 3 వేల ఫారం పాండ్లు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. శనివారం రంపచోడవరం మండలం రంప పంచాయతీ పరిధిలో గల వందిరి మామిడి గ్రామంలో ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని ఫారం పాండ్ల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి 25 ఫారం పాండ్లు గిరిజన రైతులకు ఉపయోగపడే విధంగా సుమారు మూడువేల ఫారం పాండ్లు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసి ముందుగా వెయ్యి ఫారం పాండ్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మిగిలిన 2 వేల ఫారం పాండ్లను ఈ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలలో పూర్తిచేయాలని ఆయన అన్నారు. రంపచోడవరం ఉపాధి హామీ పథకం ఏపీడీ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో మంజూరైన ఫారం పాండ్లు త్వరిత గతిన పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, రంప పంచాయతీ సర్పంచ్ చెదల వెంకటలక్ష్మి, ఎంపీడీవో యస్.శ్రీనివాస రావు దొర, ఉపాధి హామీ పథకం ఏపీవో బి.సత్యనారాయణ, వాకా వీరన్న, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, చవలం బాపిరాజు, పి.అనంత మోహన్, పండ చల్లన్న దొర, పోలోజు సురేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

సర్కేడియన్ వి యాప్ ద్వారా గుండె వ్యాధుల నిర్ధారణ

జిజిహెచ్ పర్యవేక్షకురాలు డా. విశ్వమిత్ర

విశాలాంధ్ర-పాడేరు: జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు పాడేరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 250 మంది రోగులకు గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణకు ఎన్ఆర్ఐ విద్యార్థి నంద్యాల సిద్ధార్థ్ కనిపెట్టిన సర్కేడియన్ వి యాప్ ద్వారా పరీక్షలు నిర్వహించగా పది మందికి గుండె సమస్యలు గుర్తించడం జరిగిందని జిల్లా కేంద్ర ఆసుపత్రి మేడికల్ పర్యవేక్షకురాలు డా. విశ్వమిత్ర తెలిపారు. ఆ పదిమందికి జనరల్ మెడిసిన్ నిపుణులు ప్రొ. సురేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బంది 2డి ఎకో, ఇ.సి.జి పరీక్షలు నిర్వహించగా వారు గుండె జబ్బులతో బాధపడుతున్నట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. వెంటనే వారిని కార్డియాలజీ ప్రత్యేక వైద్య నిపుణుల వద్దకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలు పాడేరు జిజిహెచ్‌లో నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని హృద్రోగులు వినియోగించుకోవాలని డా. విశ్వమిత్ర సూచించారు. 14 ఏళ్ల ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్ నంద్యాల కనిపెట్టిన ఈ సర్కేడియన్ వి యాప్ (ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్)ను ఉపయోగించి కేవలం ఏడు సెకన్లలో గుండె జబ్బులను గుర్తిస్తుందని ఆమె తెలిపారు. సర్కేడియన్ వి యాప్‌ను అభివృద్ధి చేసిన 14 ఏళ్ల ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ కలెక్టర్ విజ్ఞప్తి మేరకు మన జిల్లా పాడేరు వచ్చి ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయంగా భావిస్తున్నానని ఆమె ఆనందం వ్యక్త పరిచారు. భవిష్యత్తులో సిద్ధార్థ్ ఏఐ లో మరిన్ని ఆవిష్కరణలను రూపొందించాలని డా. విశ్వమిత్ర ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ నిపుణులు ప్రొ. సురేశ్వర రెడ్డి, ఎన్ఆర్ఐ విద్యార్థి నంద్యాల సిద్ధార్ద్, వారి తండ్రి, మహేష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటల ద్వారా నీరు నిల్వ చేసుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట : నీటి కుంటల ద్వారా నీటి నిలువ చేసుకొని వ్యవసాయ పంటల అభివృద్ధి చేసుకోవాలని డైరెక్టర్ విద్యాసాగర్ రైతు లను కోరారు. మండలంలోని సుకూరు పంచాయ తీ చట్రాయి పుట్టు నీటి కుంట పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆర్థికంగా వెనుక బడిన గిరిజన రైతులు ఉపాధి హామీ పనులను ద్వారా వ్యవసా య భూములు అభివృద్ధి చేసుకో వాలని ఆయన సూచించారు. ప్రభు త్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని బీడు భూముల సైతం సస్యశ్యామలం చేసుకోవా లని అప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్‌పీ షణ్ముఖ, ఏపీవో లింగమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



విశాలాంధ్ర - చింతపల్లి: ముస్లింలు అత్యంత పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసాన్ని కఠోర ఉపవాస దీక్షతో పాటిస్తున్న ముస్లింలు అంతే పవిత్రంగా ఉపవాస (రోజా) దీక్షలో ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు సహరీ, సూర్యాస్తమయ సమయంలో ఇఫ్తార్ విందును ఆచరిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. ఈ క్రమంలో గడచిన 20 రోజుల నుంచి ప్రతిరోజు ఆచరిస్తున్న మాదిరి గానే 21వ రోజైన శనివారం స్థానిక మజీద్ ఆవరణలో ఇఫ్తార్ విందును ఆచరించారు.

చీమలపాడులో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: సీపీఎం పార్టీ తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జిమాడుగుల మండలం గేమ్మెలి వంచాయతీ చీమలపాడు గ్రామంలో సందర్శించి గ్రామ సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా సీపీఎంపార్టీ మండల కార్యదర్శి సాగిన ధర్మన్న పడాల్, పీసా కమిటీ సెక్రటరీ గబ్బడి ఈశ్వరరావు మాట్లాడుతూ సీమలపాడు గ్రామంలో త్రాగునీరు సాగునీరు రోడ్లు డ్రైనేజీ సమస్యలతో చాలా బాధపడుతున్నారని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. రోడ్డు లేక అంబులెన్స్ రాక వర్షాకాలం ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే డోలీమోతలతో కులపాడు సెంటర్ వరకు తీసుకు వచ్చే దౌర్భాగ్య పరిస్థితి ఇప్పటికీ ఉందన్నారు. వెంటనే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉల్లి పెద్దబాయి, వార్డు మెంబర్ అంగు తిరుపతమ్మ, గ్రామస్తులు ఉల్లి కొండబాబు, మజ్జి ఆశీర్వాదం, అంగు పెద్దబ్బాయి, కృష్ణారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

27న సైన్స్ ఎక్స్ పోజర్ సందర్శన

గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం : ఈ నెల 27వ తేదిన సైన్స్ ఎక్స్ పోజర్ సందర్శన కొరకు ఒడిశా రాష్ట్రం రాయఘడ పరిసర ప్రాంతాలలోని 6 ప్రాంతాలను విద్యార్థులు సందర్శించనున్నారు. ఈ మేరకు సైన్స్ ఎక్స్ పోజర్ విజిట్ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం జరిగింది. రాయఘడ పరిసర ప్రాంతాల్లో గల మినరల్ వాటర్ ప్లాంట్ అండ్ బేవరేజ్ లిమిటెడ్, జెకె పేపర్ మిల్స్, నాగావళి ప్లానిటోరియం అండ్ సైన్స్ మ్యూజియం, ఫిమాకేమ్ లైం స్టోన్ ఇండస్ట్రీ, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో అల్లోయ్ లిమిటెడ్, పారంపాత్ పార్క్ సందర్శన కొరకు జిల్లా నుంచి 130 విద్యార్థులతో పాటు 30 మంది ఉపాధ్యాయులు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. తిరుపతినాయుడు, జిల్లా సైన్స్వర్ అధికారి జి. లక్ష్మణ్, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్. తేజేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్, పాలథిన్ నివారణలో పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిథిన్ నివారణలో భాగంగా ఇప్పటికే పట్టణంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలతో కలిసి పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారుల దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ నివారణకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరుతూ వ్యాపారులు తమ వద్ద ఉన్న పాలిథిన్ కవర్లు, ప్యాకెట్లను స్వచ్ఛందంగా అందజేయాలని చెప్పడం జరిగిందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ వాడకాల వల్ల అన్ని వయసుల వారు క్యాన్సర్ బారినపడుతున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్లాస్టిక్ పాలిథిన్ వాడకాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రాష్ట్రంలోనే ప్లాస్టిక్ నివారణకు చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా మన్యం జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ శ్యాం ప్రసాద్ కృషి చేస్తున్నారని, ప్లాస్టిక్ వాడకాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించి ముందుకు రావాలని కోరారు.

ఫారం పాండ్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో నిర్మించిన ఫారం పాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. ప్రపంచ జల దినోత్సవం రోజైన శనివారం స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడీ లాలం సీతయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ గేమ్మెలి లలిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన ఫారం పాండ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆ పథకాలకు సార్ధకత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో యూఎస్‌వి శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు, ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, పీసా కమిటీ నాయకులు, స్థానిక వార్డ్ సభ్యులు, నీటి సంఘం నాయకులు, ఉపాధి హామి పథకం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

26న ఐటీడీఏ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటీడీఏ వద్ద ఈనెల 26న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని మండల సిపిఎం నేతలు పిలుపునిచ్చారు. ములకనపల్లి, కుందులూరు గ్రామ పంచాయతీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీన జరిగే చలో ఐటీడీఏ వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ కోరారు. నర్సింగ్ పేట నుండి కుందులూరు మీదుగా పెదమట్టపల్లి వెళ్లే ప్రధాన రహదారిని గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం పేరుతో రోడ్డును త్రవ్వి వదిలి వేయడం వలన నేటికీ కనీసం పాదచారులు కూడా నడిచి తిరగలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. కారంగూడెం బి టి రోడ్డు జంక్షన్ నుండి ముల్కనపల్లి మీదుగా కోడేరు వెళ్లే బిటి రోడ్డు మొత్తం పాడైపోయి ప్రయాణానికి అసౌకర్యంగా ఉందని తెలిపారు. ఈ సమస్యలన్నింటిపై ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, సున్నం రాజులు, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్ మూర్తి, కమ్మసిచ్చు సత్యనారాయణ, గుండుపూడి లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ సవలం మారయ్య పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - దేవీపట్నం: ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని దేవీపట్నం మండలంలో అన్ని గ్రామపంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ పథకంలో ఫారం పాండ్ పనులు ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా దేవీపట్నం పంచాయతీ ఇందుకూరు -1లో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం మండల తెలుగు యువత అధ్యక్షులు లంక హరిబాబు, దేవీపట్నం గ్రామ కమిటీ అధ్యక్షులు గేదెల పెద్ద సుబ్బారావు, కూటమి నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

.ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - జీకే వీధి: గూడెం కొత్త వీధి మండలం దారకొండ పంచాయతీకి చెందిన గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాలకు గత నెల నుంచి ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని నేటికీ ఉపాధి హామీ బకాయిలు లబ్ధిదారుల ఖాతాలో జమ అవటం లేదని లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామాల ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారంగా 15 రోజులకు లబ్ధిదారుల ఖాతాలో జమ అవ్వాలని కానీ నేటికీ 40 రోజులు అవుతుందన్నారు. పని జరిగే ప్రదేశంలో టెంటు ఫస్ట్ ఎయిడ్ కిట్ ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. గతంలో టెంటు ఫస్ట్ ఎయిడ్ కిట్ ఇచ్చేవారు ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి పెండింగ్ పేమెంట్ లబ్ధిదారుల ఖాతాలో జమ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. పీసా సెక్రటరీ మండలం పండన్న మాట్లాడుతూ ఒకరోజు వేతనం ధరలకు అనుగుణంగా 600 రూపాయలు చేయాలని ప్రస్తుతం చేసిన పనులకు లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని. లేనియెడల ఎన్.ఆర్ ఈ జి ఎస్. ఎదుట రైతులతో వచ్చి ధర్నా చేపడతామని ఏ దారకొండ వైస్ ప్రెసిడెంట్ ముర్ల చంటిబాబు ,లక్ష్మయ్య సత్యారావు పేర్కొన్నారు.

అల్లూరి జిల్లాలో మత్స్య కార్మికుల్ని గుర్తించాలి

- మత్స్య కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నాగాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు మండల కేంద్రం కొత్త సుజనకోట లో ఏఐటియుసి జిల్లా కో కన్వీనర్ అమర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగాంజనేయులు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామ రాజు జిల్లాలో వేలాదిమంది మత్స్య కార్మికులు ఉన్నప్పటికీ వారిని గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలానే జిల్లాస్థాయి ఉన్నత అధికారులు విఫలం చెందారని అన్నారు. ముంచింగ్పుట్ మండలంలో కేజీ కల్చర్ గత తొమ్మిదేళ్ల కిందట ప్రారంభించినప్పటికీ నేటి వరకు దాని వినియోగంలో తీసుకోకుండా ఆదివాసి గిరిజన మత్స్యకారులకు ఎటువంటి ఉపయోగకరము లేకుండా నిరుపయోగం చేశారని విమర్శించారు. దానిని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలానే ఈ మండలంలో వివిధ గ్రామాల్లో చేపల వేట వృత్తిగా జీవనోపాధి పొందుతున్న అనేక కుటుంబాల్ని గుర్తించకుండా వారికి ఎటువంటి గుర్తింపు కార్డులు ఇవ్వకుండా స్థానిక అధికారులు నిర్లక్ష్య వైఖరి కనబరిచారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మత్స్యకారులని గుర్తించి వెంటనే వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని అన్నారు. అలానే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న పథకాలు గిరిజన ప్రాంతంలో ఉన్న మత్స్య కార్మికులకు అందేలా చూడాలని అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పైబడి ఉన్న మత్స్య కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని, మత్స్య కార్మికుల పిల్లలకు చదువుకునే విషయంలో ప్రోత్సహించాలని, మత్స్య కార్మికులకు బొట్లు, వలలు, ఇతర సామాగ్రి అందజేయాలని అన్నారు. అలానే ప్రోత్సాహకాల సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, జోలాపుట్టు డ్యాం పరిధిలో మత్స్య కార్మికులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో ప్రభుత్వమే బాధ్యత తీసుకొని చేప పిల్లలని (సీడ్స్) వేయాలని, చేపలు పెరిగేందుకు ఫీడింగ్ అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా మత్స్య కార్మిక సంఘం నాయకులు లక్ష్మణ్, స్థానిక గిరిజన మత్స్యకార్మికులు నరేష్, లక్ష్మణరావు, భాస్కర్, సోమ్రాన్న, గణపతి, దస్సో, ధనార్జన పాల్గొన్నారు.

వర్షాధార భూములకు నీటి కుంటలే ఆధారం

పీసా కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు భాస్కర్, ఆనంద్

విశాలాంధ్ర - అరకులోయ: మండలంలో బొండం పంచాయతీ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే ప్రతి లబ్ధిదారులకు కనీసం రోజుకు రూ.300 వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలని పీసా కమిటీ అధ్యక్షుడు, బొండం పంచాయతీ సర్పంచ్ డి.భాస్కర్, పీసా కమిటీ ఉపాధ్యక్షులు ఆనంద్ డిమాండ్ చేశారు. లబ్ధిదారులు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో కనీసం ఆరు గంటలపాటు పనుల్లో పాల్గొనడం ద్వారా వారికి రోజుకు రూ.300 కనీస కూలీ లభించేలా విధంగా చూడాలన్నారు. ఉపాధి వేతన దారులు ప్రతి రోజూ ఉదయం సాయంత్రం వరకు పనుల్లో పాల్గొనడం ద్వారా రోజుకురూ.300 కూలీ వేతనాన్ని పొందవచ్చని ఆయన తెలిపారు బొండం పేసా క్లస్టర్ ఉపాధ్యక్షులు,ఎస్, ఆనంద్,శనివారం బొండం పంచాయతీ కెరటాంలో ప్రారంబం లో పాల్గొని ఆయన మాట్లాడుతూ వరల్డ్ వాటర్ డే సందర్భంగా జల సంరక్షణలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో రైతుల వ్యవసాయ భూముల్లో చేపట్టిన ఫారంపాండ్ల నిర్మాణాలను అనంతరం అదే గ్రామానికి చెందిన గొల్లోరి రాంభమాజ్జి గారువులో భూ యమానులతో మాట్లాడారు. ఇక్కడ పంటకుంట ఏర్పాటుకు రూ.224661 మంజూరు చేయడం జరిగిందని, వేతనదారులకు చెప్పారు. బొండం పంచాయతీ ప్రతి గ్రామలో కొన్ని పంటకుంటలను శాస్త్రీయ పద్ధతిలో పూర్తి స్థాయిలో జలసంరక్షణ జరిగేలా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు పీసా ఉపాధ్యక్షులు, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లకు వివరించారు. ఈ కార్యక్రమంలో బొండం పంచాయతీ విఆర్,పి సుంకరి ముత్యాలమ్మ,మేట్ గత్తుం రామరాజు సుంకరి బుజ్జి, బారికి అప్పలస్వామి, భూ యజమానులు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి కోణంలో సంస్కరణలు ఉండాలి

విశాలాంధ్ర - బెలగాం: విద్యా సంస్కరణల్లో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ఎంఎస్ నెం: 117 స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం నూతన జీఓ కోసం చేస్తున్న కసరత్తులో ఉపాధ్యాయులను, పాఠశాలలను తగ్గించడం కాకుండా పిల్లల అభివృద్ధి కోణంలో సంస్కరణలు ఉండాలని పిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా మోడల్ ప్రైమరీ పాఠశాలను ప్రతీ గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేయాలని, మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు కోసం మరే ఇతర ప్రాథమిక పాఠశాలల నుండి 3,4,5 తరగతుల విద్యార్థులను మ్యాప్ చేయరాదన్నారు. మిగిలిన ప్రాథమికోన్నత పాఠశా లలను యధావిధంగా కొనసాగించాలని, సమాంతర మీడియంలను ఉన్నత పాఠశా లలో కొనసాగించాలని, దూరంతో సంబంధం లేకుండా 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ చేయాలన్నారు. సిపిఎస్, జీపిఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, 12వ పిఆర్సీ కమీషన్‌ను నియమించి, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి నూతన ప్రభుత్వం ఉద్యోగుల పట్ల తమ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ముత్యాలమ్మ జాతర విజయవంతానికి సహకరించండి

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

విశాలాంధ్ర - చింతపల్లి: చింతపల్లి గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు జరగనుందని, విజయవంతానికి అన్ని వర్గాల వారి సహకారం అవసరమని పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం స్థానిక పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరిలు విచ్చేసి మాట్లాడారు. భక్తులకు, ప్రజలకు ఎక్కడా, ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, ఇతర సమస్యలు తలెత్తకుండా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా హేమత్ కుమార్, వినాయకరావు

ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి వినాయకరావుని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వర్తక సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డేటి జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు పాల్గొన్నారు.

ఫారం పాండ్స్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర జీకే వీధి: మండలంలో పంచాయతీ పరిధి గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు ఘనంగా జల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఫారం పాండ్స్ నిర్మించుటకు గాలికొండ, జర్రెల, లక్కవరపుపేట, దేవరపల్లి, వంచుల పంచాయతీల సర్పంచ్‌లు సిరిబల బుజ్జిబాబు, వనపల కాసులమ్మ, వీరోజి నాగరాజు, కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, కాకూరి బొజ్జబాబు, ఏపీవో చాల్లంగి రాంప్రసాద్, ఎంపీపీ బోయని కుమారి పంచాయతీ ఆయా గ్రామాల్లో శనివారం భూమి పూజ నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు వృధాగా పోకుండా అడ్డుకట్టుగా ఫారం పాండ్ నిర్మించడంతో వాగులు నుండి వచ్చే వర్షపు నీరు నీటి కుంటలో నీరు చేరికతో నీటి వసతి మెరుగుపరచుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ బోయని కుమారి, ఏపీవో చాల్లంగి రాంప్రసాద్, సర్పంచులు కాకూరి బుజ్జిబాబు, వనపల కాసులమ్మ, కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, సిరబల బుజ్జిబాబు, వైస్ సర్పంచ్ గుమ్మడి రాజబాబు, ఎంపీటీసీముట్టడం సత్యనారాయణ, వైసిపి జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోత్తూరు కొండలరావు, పీసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుటుంబ ఆహార భద్రత సాధించాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: రాబోయే రోజుల్లో కూడా కొన్ని గ్రామాల్లో జీవ కార్యక్రమాలు అంతర పంటలు మిశ్రమ పంటలు సరిహద్దు పంటలు మొదలుకుని అన్ని రకాల పంటలు వేసుకొని కుటుంబ ఆహార భద్రత సాధించాలని జాతీయ భారత నైపుణ్యాభివృద్ధి ఫౌండేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నాబార్డ్ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో జీవ ప్రాజెక్ట్‌లోని కార్యక్రమాల అమలు తీరును పరిశీలించడానికి భారత జాతీయ నైపుణ్యాభివృద్ధి ఫౌండేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తన బృందం మురుగేశన్, వీర భద్రారెడ్డి లతో కలసి గోరడ గ్రామంలో తాడంగి అమరావతి ,పువ్వుల గౌరయ్య, టి. బంగార్రాజు క్షేత్రాలను పరిశీలించి వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు చేయు కార్యక్రమాలు అట్టడుగు వర్గాల ప్రజలకు, రైతులకు ఏ విధంగా చేరుతున్నాయి వాటిని ఉపయోగించి ఏ మేరకు సఫలీకృతం అవుతున్నారు అన్న దానిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జీవా ప్రాజెక్ట్ మానిటరింగ్ అధ్యక్షులు పి జమ్మయ్య, కార్యదర్శి కె చిరంజీవి, ఆది తల్లి, ఎఫ్ పి.సి సి.ఈ.ఓ పేకాపు మురళి , జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి ప్రబోద్, జట్టు సిబ్బంది,రైతులు మన్మధరావు రామారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: పోషన్ భీ పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల నుండి శిక్షణ ఇస్తున్నట్లు ఐసిడిఎస్ సీడీపీఓ దేవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0-6 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లల సంరక్షణ, వారి ఆరోగ్య పరిరక్షణ, ఆటపాటలతో కూడిన చదువు, అలాగే సెలవులకు స్కూల్ నుండి ఇళ్లకు వచ్చిన మైనర్ బాలికలకు స్వీయ రక్షణ కోసం తెలియజేయడం, బాల్య వివాహాలు అడ్డుకోవడం వంటి వాటిపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీఓ యదగిరేశ్వరరావు పాల్గొన్నారు.

అడ్డతీగలలో ఫారం పాండ్స్ ప్రారంభం

విశాలాంధ్ర - అడ్డతీగల: ప్రపంచ జల దినోత్సవంను పురస్కరించుకొని శనివారం అడ్డతీగల మండలం మట్లపాడు పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఫారం పాండ్స్‌ను సర్పంచ్ చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. మొత్తం 550 ఫారం పాండ్‌లకు గాను పంచాయతీకి 25 చొప్పున వేయాలని, జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కెఆర్ విజయ, ఏపిఓ జె.అరవాలు తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట అమ్మ "అన్న" క్యాంటీన్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పేదల పాలిట అమ్మలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ ఆదుకుంటుందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం విధి నిర్వహణలో భాగంగా అన్న క్యాంటీన్‌ను ఆయన పర్యవేక్షించి ఈ క్యాంటీన్లో పలహారం చేస్తున్న పలువురు పేదలను పిల్లలను పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ అమ్మలా మూడు పూటలా పేద ప్రజలను ఆదుకుంటుందని కొనియాడారు. వాస్తవానికి పేద ప్రజలు బయట భోజనం చేయాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకుంటుందని అదే అన్నా క్యాంటీన్లో భోజనం చేయడం వల్ల మూడు పూటలా 15 రూపాయలతో సరిపెట్టుకోవచ్చన్నారు. ఈ అన్న క్యాంటీన్ ను పేద ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని,ఉద్యోగులు వ్యాపారులు మానవతా దృక్పథంతో ఈ అన్న కాంటీన్ అభివృద్ధికి ప్రభుత్వానికి సహాయం అందించి మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా దేవాన్ష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చింతపల్లి: టీడీపీ జాతీయ నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనుమడు, విద్యా శాఖ మంత్రి లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ జన్మదినోత్సవాన్ని చింతపల్లిలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక మండల పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి దేవాన్ష్ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, రాము, ఖాసిం వల్లి, సోమేశ్, ఎం.రాజుబాబు, జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, కిముడు కృష్ణమూర్తి (పండు) పాల్గొన్నారు.

నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుల నిర్మాణం

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలో అతి మారుమూల బూదరాళ్ల పంచాయతీ పరిధిలో ఉమ్మడి విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి ట్యాంకులను సంస్థ ప్రతినిధులతో సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ ప్రారంభించారు. మండలంలోని బూదరాళ్ల పంచాయితీ. బొడ్డు మామిడి, పోకలపాలెం, అన్నవరం, గొర్రెల మెట్ట, దోడవ గొయ్యి గ్రామాల్లో నర్సీపట్నం నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మేనేజర్ ఎం.వీరు నాయుడు, కోఆర్డినేటర్ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవికాలం దృష్టిలో పెట్టుకొని పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాలకు మంచినీటి సదుపాయం కల్పించాలనే సదుద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు తీసుకుని ముందుకు వెళ్తున్నామని వారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని గ్రామాల్లో ఈ మంచినీటి పథకాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ బుజ్జి, స్థానిక సూపర్ ఎంపీటీసీ వంతల నారాయణ, వార్డు మెంబర్ సంజీవ్, కూటమి నాయకులు కొర్ర కొండబాబు, వైసిపి నాయకులు కొర్ర తిరుపతి పాల్గొన్నారు.

బ్యాంకులో రూ.13 కోట్ల అవకతవకలు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకులో డ్వాక్రా రుణాల పేరుతో సుమారు 13 కోట్ల రూపాయల అవకతవకలు జరిగినట్లు వెలుగు ఏపీఎం రామాంజనేయులు శనివారం మీడియాకు తెలిపారు. బ్యాంకు సిబ్బంది మండలంలో 107 డ్వాక్రా సంఘాల ఖాతాలలో వారికి తెలియకుండా నిధులు జమ చేసి వారం రోజులనంతరం తిరిగి తీసుకోవడం వలన, ఆయా సంఘాలకు ఈ నిధులకు సంబంధించిన వడ్డీ జమ అవుతుందని, ఈ విధంగా 107 గ్రూపులకు సుమారు లక్ష 70000 రూపాయలు వడ్డీ జమ అయిందని ఆయన తెలిపారు. ఇప్పటికే కొన్ని సంఘాల సభ్యులు ఆ వడ్డీని చెల్లిస్తున్నారని, అయితే ఈ విషయం గ్రూపు సభ్యులకు తెలియకుండా ఉండేందుకు బ్యాంకు వారు పాత బాకీ ఉండగానే, వాటిని మాఫీ చేసి కొత్తరుణాలు ఇస్తామంటూ డ్వాక్రా గ్రూపులకు ఆశ చూపించి, అదనంగా జమ అయిన వడ్డీని తెలియకుండా చేసే వారని, అయితే అదనపు వడ్డీ ఎవరి ఖాతాలోకి వెళుతుందో తెలియాల్సి ఉందని, ఈ విషయం వెలుగు ఎపిడి, ఐటిడిఎ పిఓ దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు.

కాఫీ తోటలు దగ్ధం

విశాలాంధ్ర - అనంతగిరి: రైతులకు ఏడాదికి లక్షలాది రూపాయలు ఆదాయాన్నిస్తూ చేతికి అంది వచ్చిన కాఫీ తోటలు దగ్ధం కావడంతో రైతులు లబోదిబోమన్నారు.

మండలంలోని వేంగడ పంచాయతీ పరిధి డొంకపుట్టు గ్రామానికి చెందిన సఫీ గంగన్న ఒక ఎకరం సపి గాసాన్నకు చెందిన రెండు ఎకరాల కాఫీతోటలకు శుక్రవారం మధ్యాహ్నాం గుర్తు తెలియని వ్యక్తులు నిపుంటిచడంతో పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. మండుటెండలకు అటుగా వెళ్లిన వ్యక్తులు తోటకు నిప్పు అంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి తోటలు అంతా కాలిపోయాయి.

గమనించిన రైతులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. ఏడాదికి ఎకరాకు 1 లక్ష 50 నుండి 2 లక్షల పైగా ఆదాయం వచ్చేదని తోటలు కాలిపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోయారు. ప్రభుత్వం తక్షణమే రీప్లాంటేషన్‌కు కాఫీ సిల్వర్ మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడమే కాకుండా ఆర్థిక సహాయం అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

258 కేజీల గంజాయి పట్టివేత : రెండు కార్లు సీజ్

విశాలాంధ్ర - పాచిపెంట: మండలంలో గల ఆరు రహదారుల సమీపంలో గల గోగాడవలస మాతుమూరు మధ్యలో258 కిలోల 235 గ్రాములు కిలోలు గంజాయిని పట్టుకున్నట్లు సాలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి రామకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. పాచిపెంట పోలీస్ స్టేషన్లో ఆయన శనివారం విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూగోగాడవలస మాతుమోరు మధ్యలో గల గ్రీన్ ఫీల్డ్ రహదారి లో మారుతి 800 మరియు నిస్సాన్ రెండు కార్లు ఆగి ఉన్నాయని వీఆర్వో రవిరాజు శుక్రవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు పోలీసుల అక్కడ చేరుకొని కార్లు తనిఖీ చేయగా రెండు కారులో 134 ప్యాకెట్లలో 258 .235 కిలోలు గంజాయి సుమారు 25 లక్షల 80000 విలువ గల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు సిఐ పి రామకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి సాలూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి రామకృష్ణ దర్యాప్తు చేసి నట్టు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా ఎవరైనా చేసినట్లయితే చట్టరీత్యా వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు అలాగే గంజాయి మత్తు పదార్థాలు ఏవైనా త్రాగిన అక్రమ రవాణా చేసినట్లు ఎవరికైనా తెలిసినచో 19 72 టోల్ ఫ్రీ కి ఫోన్ చేయాలని తెలిపారు. 2025 జనవరి నుండి ఎంతవరకు సుమారుగా 1100 కిలోలు గంజాయిని ఫోర్ వీల్స్ వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. పోలీసులకు గంజాయి అక్రమ రవాణా అరికట్టడం విషయంలో ప్రజలు పోలీసులకుసహకరించాలని అదేవిధంగా మీడియా మిత్రులు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. గంజాయి అక్రమ రవాణా పై నిఘా వేసి అధిక కిలోలు ఈ మూడు నెలల్లో గంజాయి పట్టుకున్న స్థానిక ఎస్సై వెంకట సురేష్కి సిబ్బంది కృషికి ఉన్నత అధికారులు ప్రశంసలు అందిస్తున్నారని సిఐ అన్నారు. ఈయన వెంటఏఎస్ఐ ముసలి నాయుడు ట్రైనింగ్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం భద్ర గరిలో గల స్థానిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, నందు 5వ తరగతి నుండి 2025-26 విద్యాసంవత్సరముతో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించబడుచున్నాయని ప్రిన్సిపాల్ డి.వీరప్రసాద్ బాబు ఈ ప్రకటనలో తెలియజేశారు. 5వ తరగతిలో 2025-26 సంవత్సరానికి 80 సీట్లు కలవని తెలియజేశారు. 2024-25 సంవత్సరంలో 4వ తరగతి పూర్తి చేసినవారు దీనికి అర్హులని తెలియజేశారు. దరఖాస్తులను www.aptwreis.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9948944919, 9440348217ను సంప్రదించాలని కోరారు.

27న కాసాపేట ఉప సర్పంచ్ ఎన్నిక

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని కాసాపేట గ్రామపంచాయతీలో ఉప-సర్పంచ్ ఎన్నిక ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. 8మంది సభ్యులు గల ఈపంచాయతీలో గత ఏడాది ఉప సర్పంచ్ రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీ అయింది. దీంతో ఈపదవిని భర్తీ చేయడంకోసం నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందన్నారు.

అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర- సీతంపేట: మండల కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీతంపేట వారి ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం కేజీబీవీ పాఠశాల సమీక్ష మందిరంలో జరిగింది. పోషణ భీ, పడాయి బి కార్యక్రమం ద్వారా తల్లులు,పిల్లలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, అదేవిధంగా ఆడపిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించి అందరూ అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పి. రంగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో గీతాంజలి పాల్గొని తల్లి పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసిడిఎస్ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సూపర్వైజర్లు గౌరీ, మిస్సమ్మ, లావణ్య, బేగం మరియు టెక్నికల్ పర్సన్స్ తిరుపతి, స్వాతి పాల్గొన్నారు.

3 వేల లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

విశాలాంధ్ర- సీతంపేట: మండలం కుసుమి గూడా గ్రామంలో శనివారం 3000 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేయడం జరిగిందని, 50 కాలీ ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీన పరుచుకోవడం జరిగిందని సబ్ ఇన్స్పెక్టర్ అమ్మనరావు తెలిపారు. ఏజెన్సీల పాఠశాల తయారుచేసి అమ్మకాలు జరిపిన, బెల్ట్ షాపులు నిర్వహించిన, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలకు కొనసాగుతున్న శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని మరిపవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బలిజిపేట ప్రాజెక్ట్ పరిధిలోని నిడగల్లు, గుచ్చిమి సెక్టార్లుకు చెందిన 45మంది అంగన్వాడీ కార్యకర్తలకు పోషణభీ పడాయిభీ పై శిక్షణ కొనసాగుతుంది. లోపపోషణ పిల్లల్ని ఎలా గుర్తించాలి,లోపపోషణకి ఎందుకు గురవుతున్నారూ, పోషకాహార ప్రాముఖ్యత గురించి దివ్యాంగులు ఎలా గుర్తించాలి, గుర్తించి తరువాత పిల్లలను ఎలా రిఫరల్ చేయాలన్న అంశంపై శిక్షణ ఇచ్చారు.ఐసీడీఎస్ సిడిపిఓ ఎస్. సులేఖ, సూపర్వైజర్ యు .పూర్ణిమ, బి. పద్మావతి ఆధ్వర్యంలో గతమూడు రోజులపాటు అందజేసిన శిక్షణకార్యక్రమాలు వలన ఎన్నో విషయాలు తెలిశాయని కార్యకర్తలు తెలిపారు.

నేడు 39 కేంద్రాల్లో ఉల్లాస్ అర్హత పరీక్ష

విశాలాంధ్ర - పార్వతీపురం: అక్షరాస్యత అర్హత పరీక్షను మండలంలోని 35పరీక్ష కేంద్రాల్లో నేడు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ త్రివిక్రమరావు, వెలుగు ఏపిఎం శ్రీరాములునాయుడులు తెలిపారు.దీనికి సంబంధించి ప్రశ్నాపత్రాలను శనివారంనాడు వారిచేతులమీదుగా అందజేశారు. మండలంలోని 1430మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వయోజనులైన మహిళలలో అక్షరాస్యత పెంపొందించడానికి ఉల్లాస్ కార్యక్రమంను నవంబరు 15న ప్రారంభించామన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా వయోజనులకు చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయగలగడం నేర్పించామని తెలిపారు.ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత ఇతర జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేయొచ్చు అన్నారు. పౌరులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈకార్యక్రమంలో ఎస్. హెచ్.జి లలో చదువురాని మహిళలను గుర్తించి వారికి వాలంటీర్ టీచర్స్ చదువు చెప్పారని తెలిపారు. నేడు పరీక్షా కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారన్నారు.

స్వర్ణఆంధ్ర- స్వచ్ఛఆంధ్రను విజయవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర, సీతానగరం: గ్రామపంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు తెలిపారు. గతరెండురోజులుగా పెదభోగిలిపంచాయతీలోని చెత్త సంపద కేంద్రంలో పంచాయతీ విస్తరణ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ పార్వతీపురం మన్యంజిల్లా కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా గ్రామాల్లో తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరణ చేయాలన్నారు. పంచాయతీల్లో చేపట్టవలసిన కార్యక్రమాలు గూర్చివరించారు. ఈశిక్షణాసమావేశంలో పరిపాలన అధికారి ప్రసాద్, జిల్లా రిసోర్స్ పర్సన్ కె చంద్రశేఖరరావు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

నవోదయం 2.0తో నాటుసారా నిర్మూలన



విశాలాంధ్ర, సీతానగరం: సర్కిల్ పరిధిలోని సన్యాసిరాజు పేట , కొంకిడివారంగ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమములో బాగంగా నాటుసారాయి తాగడంవల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించామని సిఐ పద్మావతి తెలిపారు. గరుగుబిల్లి మండలంలో నాటుసారాయిప్రభావంతున్న కొంకిడివరం , ఎస్ ఆర్ పేట, ఉల్లిభద్ర, లఖనాపురం గ్రామాలను అధికారులు దత్తత తీసుకున్నారని, ఈగ్రామాలలో నాటుసారాయిఅమ్మకాలు నిర్మూలన ధ్యేయంగా రెవెన్యూ ,పోలీసుసహకారంతో నిరంతరనిఘా మరియు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని సిఐ పద్మావతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ షరీఫ్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం పరీక్షా కేంద్రం ఎత్తివేతపై సభ్యుల ఆగ్రహం

విశాలాంధ్ర - సీతానగరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఈఏడాది ఎత్తివేయడం చాలాదారుణమని, దీనిపై సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ బలగ రవణమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండల వ్యవసాయ అధికారి అవినాష్ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రికరణ వస్తువులను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీతానగరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఎత్తివేతపై వేయడంపై సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫర్నిచర్ పేరుతో ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రం ఎత్తు వేయడం సమంజసమేనా అనిప్రశ్నించారు. పరీక్షా కేంద్రం ఎత్తివేతపై కనీస సమాచారం అందజేయకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. గత 30ఏళ్లుగా లేని ఫర్నిచర్ సమస్య ఇప్పుడు ఉండడమేమిటని వారంతా ప్రశ్నించారు.పలువురుశాఖల అధికారులు వారి శాఖల గూర్చి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మామిడి బాబ్జి ఎంపీడీవో త్రివిక్రమరావు, పరిపాలన అధికారి ప్రసాదరావు, తహశీసిల్దార్ ప్రసన్నకుమార్, ఉప తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట: నూతన ఉపాధి హామీ పనులను సద్విని యోగపరుచుకోవాలని సుకూరు పంచాయతీ సర్పంచ్ ధనసని సత్యవతి కోరారు. మండలంలోని సూకూరు పంచాయతీలో నూతన ఉపాధి హామీ పనులకు భూమి పూజ చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ కూలిపనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి అనేక కష్టాలు పడుతూ కూలికి తగ్గ ప్రతిఫలం అందాక అర్ధకాలితొ అలమటిస్తూ మృత్యులోకాలకు చేరుకుంటున్నా రని వీటిని గుర్తించిన ప్రభుత్వాలు పేదరికంలో ఉన్న కూలీల కోసం, వలస విధానం నిర్మూలించడం కోసం ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాల న్నారు. ప్రస్తుతం వేసవి సమీపించ డంతో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు పనిచేసే స్థలంలో మంచినీ ళ్లు, మెడికల్ కిట్టు పెట్టుకోవాలని అలాగే వడదెబ్బ తగలకుండా టార్పన్లను ఏర్పాటు చేసుకోవాలని ఆమె కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఉండేలా చూడాలని అలాగే తప్పక కూలి పని ఉండేట ట్లు చర్యలు తీసుకోవాలని వీఆర్ పి లకు ఆమె సూచించారు. గ్రామాల లో అర్హులైన ప్రతి గిరిజన రైతు ఈ ఉపాధి హామీ పనులను వినియో గించుకుని లబ్ధి పొందాలని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీఓ లింగమూర్తి, నాయకులు మురళి, విఆర్ పి లు ప్రవీణ్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు మెరుగుపరచాలి

విశాలాంధ్ర - బెలగాం : పిహెచ్సీల్లో సాధారణ ప్రసవాలు మెరుగు పడేందుకు శిక్షణ ద్వారా నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు స్టాఫ్ నర్సులకు సూచించారు. సాధారణ ప్రసవాలపై రీ ఓరియంటేషన్ శిక్షణను (ఎస్.బి.ఎ) పిహెచ్సీ స్టాఫ్ నర్సులకు బ్యాచ్ ల వారీగా ఇవ్వడం జరుతుంది. ఒక్కో బ్యాచ్ కు ఆరోగ్య కార్యాలయంలో, జిల్లా ఆసుపత్రిలో మొత్తం 21రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యాలయంలో శనివారం డిఎంహెచ్ఓ పలు సూచనలు చేశారు. గర్భిణీ నమోదు జరిగినప్పటి నుంచి గర్భిణీ ఆరోగ్య పరీక్షలు, ప్రసవం, ప్రసవ సమయంలో తలెత్తే సమస్యలను నివారించడంలో నైపుణ్యతను పొందడం, ప్రసవానంతరం కాలంలో బాలింత, శిశువులకు ప్రాథమిక మరియు అత్యవసర సంరక్షణ అందించడం, హైరిస్క్ ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి ప్రమాదకర పరిస్థితులకు దారి తీయకుండా సురక్షిత సాధారణ ప్రసవం ధ్యేయంగా శిక్షణలో నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. మాతా, శిశు మరణాలు నివారించడం, పిహెచ్సీ ప్రసవాలు మెరుగు పర్చడం శిక్షణ ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డా. ఎం. వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళు నిర్మాణాలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర - కురుపాం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు ఇళ్ళు నిర్మించుకునేందుకు అదనపు ప్రోత్సాహకాలు అందిస్తుందని ఇళ్ళు నిర్మణాలు వేగవంతం చేయాలని పాలకొండ హౌసింగ్ ఈఈ జి.రవి లబ్ధిదారులకు సూచించారు. శనివారం కురుపాం మండలం లో సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ బిసి లబ్ధిదారులకు అదనంగా యాబై వేల రూపాయలు ,పివిటిజిలకు లక్ష రూపాయలు ,ఎస్టీ లకు డబ్బై ఐదు వేల రూపాయలు ప్రధానమంత్రి జన్ మాన్ ఆవాస యోజన ,అలాగే బిఎల్ వి సి అర్బన్ లబ్ధిదారులకు అధనపు ప్రోత్సాహం అందజేయటం జరుగుతుందని అన్నారు.

నాణ్యత ప్రమాణాలతో ప్రహరీ నిర్మించాలి

విశాలాంధ్ర - కురుపాం: నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఈఈ జి.రవి ఆదేశించారు. శనివారం మద్యాహ్నాం కురుపాం మండల ఇంజనీరింగ్ అధికారి వి.నాగేశ్వరరావుతో కలసి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెళ్ళి వలస, దిమిటి గూడ ప్రహరీ గోడల నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటపాలెం నర్సరీ పరిశీలన

విశాలాంధ్ర - జి.మాడుగుల: పాడేరు డీఎఫ్వో సందీప్ రెడ్డీ భీరం పంచాయతీ. వి.కోడాపలి (వెంకటపాలెం)లో నిర్మించిన నర్సరీని పరిశీలించారు. కాంపా స్కీమ్ ద్వారా అడవులను పెంపకం చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం కాంపా పథకం ద్వారా చేపట్టిన పనులను తనిఖీ చేశారు. అడవుల రక్షణలో భాగగా వేసవిలో తీసు కోవాల్సిన జాగ్రత్తాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో ఆర్.అప్పలనాయుడు, ఎఫ్ఎస్వోలు జి.శ్రీరాములు, వివి.నాయుడు, బీట్ అధికారిని జి.యాదేవి. సిబ్బంది కె. సత్తీబాబు, ఎం.బాలన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర జీకే వీధి: మండల పరిషత్ కార్యాలయంలో సిడిపిఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగనవాడి సూపర్వైజర్లు డి వలసమ్మ, కె రామలక్ష్మి,డి మోహిని,కె కృష్ణకుమారి, అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. మూడు రోజుల శిక్షణ ద్వారా పోషణ్ బి పడాయి బి శిక్షణలో బాల్య రంబ సంరక్షణ, విద్య , పిల్లల సమగ్ర అభివృద్ధిని గూర్చివివరించడం జరిగింది. పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను స్థూల ఎస్ ఏ ఎం ఎం ఏ ఎం పిల్ల గుర్తింపు నివారణ నిర్వహణ,

కార్యకర్తల్లో సూక్ష్మ పౌష్టికాహారం లోపం గూర్చి అంగన్వాడి కార్యకర్తల్లో సామర్థ్యాలు పెంపొం దించుటకు ఉపయోగపడు తుందన్నారు. కార్యకర్తలు అందరూ పోషణ ట్రాకర్ ఆఫ్ లో రిజిస్ట్రేషన్ 100 శాతం నమోదు చేయాలని అన్నారు..గర్భవతులు,బాలింతలు టి హెచ్ ఆర్ పిల్లలకు తప్పనిసరిగా పేస్ కాప్చర్ ఎఫ్ ఆర్ ఎస్ 100% నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీదేవి, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థ పదార్థాల నిర్వహణపై శిక్షణ

విశాలాంధ్ర - సీతంపేట: పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు సీతంపేట మండలం సీతంపేట గ్రామపంచాయతీ ఎస్ డబ్ల్యు పిసి షెడ్ నందు మండలంలో గల క్లాప్ మిత్రులకు, గ్రీన్ గార్డులకు, పంచాయతీ కార్యదర్శులకు ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి చెత్తను ఏ విధంగా గ్రీన్ అంబాసిడర్స్ సేకరించాలి ఏ విధంగా వేరుచేసి దానిని వర్మీ కంపోస్ట్‌గా మార్చాలి అన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ లెవెల్ పంచాయతీ అధికారి జే.రాంప్రసాద్, ఎంపీడీవో కె.గీతాంజలి, ఈవోపీఆర్డి కే.సత్యం, డిపిఆర్సి రిసోర్స్ పర్సన్ కన్నబాబు, సీతంపేట పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

27 నుండీ ముత్యాలమ్మ జాతర

విశాలాంధ్ర - ఎటపాక: ఈనెల 27, 28, తేదీలలో ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం జరుగుతుందని జాతర కమిటి సభ్యులు పేర్కొన్నారు. ఎటపాక మండలంలోని గౌరీదేవి పేట, గన్నేరు కొయ్య పాదు,గన్నవరం, సమీపంలోని చెరువు కట్టపై వేంచేసియున్న ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం దొంతు హరిప్రసాద్, వైస్ ఎంపిపి దొంతూ మంగేశ్వరావు ఆధ్వర్యంలో సహకారంతో అంగరంగ వైభవంగా జరిగేందుకు, జాతర మహోత్సవం ఏర్పాట్లు కమిటి సభ్యులు ముమ్మరంగా చేస్తున్నారు. ఈనెల 27న హెూమం, బలిపూజ కార్యక్రమం, 28 తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అందరూ హాజరై అమ్మవారినీ దర్శించుకోవాలని కోరారు.

పీఎం ఎఫ్ఎంఈ నిచ్చెనలు పంపిణీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలో వెలుగు ఆఫీస్ వద్ద ప్రభుత్వం అందిస్తున్న పీఎం ఎఫ్ఎంఈ స్కీం ద్వారా గిరిజన ప్రాంతంలో మిరియాలు వంటి పంట అభివృద్ధి కొరకు, రైతులకు సులభతరంగా ఉండే నిచ్చెనను తక్కువ సబ్సిడీకి అందిస్తున్నట్టు ఏపీఎం వంతల ఈశ్వర్ బాబు నాయుడు తెలిపారు. మండలంలో కొంతమంది రైతులకు ఏపీ టీడీపీ డైరెక్టర్ రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు, మాజి మంత్రి మత్స్యరాస మణి కుమారి ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎస్.చిట్టిబాబు, తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్, కూటమి నాయకులు, పంచాయతీ ప్రెసిడెంట్ కీముదు రాంబాబు, ఎంపీటీసీ మత్స్య రస విజయ కుమారి, వెలుగు ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్ష పత్రాలు విడుదల

విశాలాంధ్ర - కొమరాడ: మహిళా సంఘ గ్రూపులో ఉన్న నిరక్షరాస్య సభ్యులకు ఆదివారం జరగబోయే పరీక్ష పత్రాలు ఎంపీడీవో ఎం.మల్లికార్జున రావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లా డుతూ ఆదివారం జరగబోయే మహిళా సంఘం గ్రూప్ సభ్యుల్లో నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అని అన్నారు. ఉల్లాస్ ప్రోగ్రాం ద్వారా రాత్రిపూట విద్య నేర్చుకున్న గ్రూపు సంఘం సభ్యులు 1342 మంది పరీక్షకు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పి.సురేష్ బాబు, సిసి వెంకటరమణ, ఈవోపీలు పాల్గొన్నారు.

గిరిజనుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర- వై రామవరం: వై.రామవరం మండలం కె.ఎర్ర గొండా గ్రామానికి చెందిన గిరిజనుడు మిరియాల సంకురుదొర(38)అనుమానాస్పదంగా మృతి చెందాడు.ఈనెల 20 గురువారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.మృతుడు గురువారం వాడపల్లి సంతకు వెళ్లి అక్కడ నుండి వచ్చి సాయంత్రం కల్లు చెట్లకు వెళ్ళాడని కుటుంబీకులు తెలిపారు .అనంతరం గ్రామం లోనికి రావడం జరిగిందని గ్రామ శివారులో విగత జీవుడైన విషయం ఎవరికీ తెలియలేదన్నారు. ఆలస్యంగా చూసిన గ్రామస్తులు,కుటుంబీకులు మృతదేహాన్ని దహనం చేసేందుకు నిర్ణయించుకోగా పోలీసు లకు సమాచారమ్ అందడం తో శనివారం వై.రామవరం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వండి

విశాలాంధ్ర - చింతపల్లి :- అల్లూరి జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో నిర్వహించే రక్తదాన శిబిరంలో భాగంగా శనివారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి చేతులు మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు అపోహలు విడనాడి రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్నవారికి ప్రాణదాతలు కావాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో 52 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, జిల్లా వైస్ చైర్మన్ గంగరాజు, కార్యదర్శి గౌరీ శంకర్, కోశాధికారి పి సూర్యారావు, సభ్యులు ప్రసాద్ నాయుడు, డాక్టర్ రాఘవేంద్రరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.